## పాతబస్తీలో మైనర్ల ర్యాష్ డ్రైవింగ్.. పలువురికి గాయాలు



హైదరాబాద్, మే 31 ప్రభాతవార్త : నగరంలో వరుస ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వాహనాలను వేగంగా నడపవద్దని అధికారులు చెప్తున్నా జనాలు లెక్క చెయ్యడంలేదు. ఇప్పుడు మరో ఘటన వెలుగు చూసింది. తాజాగా ఓ కారు బీభత్సాన్ని సృష్టించింది. మితిమీరిన వేగంతో ఒక్కసారిగా కారు దూసుకొచ్చింది. పాతబస్తీ రెయిన్‌బజార్‌లో మైనర్ల ర్యాష్ డ్రైవింగ్ కారణంగా ప్రమాదం జరిగింది. అతివేగంగా వాహనదారుడిపైకి కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులోని ముగ్గురు మైనర్లకు కూడా గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షత గాత్రులను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మైనర్ ర్యాష్ డ్రైవింగ్ కారణంగా ప్రమాదం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తూ చాలా చోట్ల ప్రమాదాలకు కారణమవుతున్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై పోలీసులు చర్యలు చేపట్టినా వాటిని కొందరు ఏమాత్రం లెక్కచేయడం లేదు. నిబంధనలు పాటించకపోవడం వల్లే మైనర్లు ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు.

### సూపర్‌వైజర్ వేధింపులకు నిరసనగా..

## పారిశుధ్య కార్మికుల ఆందోళన



హైదరాబాద్, మే 31 ప్రభాతవార్త : హైదర్‌గూడ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ ముందు జిహెచ్‌ఎంసి పారిశుధ్య కార్మికులు ఆందోళనకు దిగారు. సూపర్‌వైజర్ శ్రీనివాస్ తమకు మానసికంగా, లైగికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ ధర్నాకు దిగారు. తను చెప్పినట్లు వినకపోతే దూర ప్రాంతాలకు ట్రాన్స్ఫర్ చేస్తున్నారని ఆరోపించారు. తన కొడుకు పెళ్లికి కూడా సెలవు ఇవ్వడం లేదంటూ ఓ కార్మికురాలు కన్నీరు పెట్టుకున్నారు. విధులు బహిష్కరించి రోడ్డుపై బైటాయించారు కార్మికులు. పై అధికారులకు తమ సమస్యను చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్‌ను తొలగించే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు కార్మికులు.

## ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



శ్రీవారికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు



రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, రామన్‌గౌడ్‌ను సత్కరిస్తున్న త్రినాథబాబు

సైఫాబాద్, మే 31 ప్రభాతవార్త: హిమాయత్ నగర్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)చే నిర్మించబడిన శ్రీపద్మావతి గోదాదేవి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ నెల 26వ తేదీ సాయంత్రం అంకురార్పణతో శ్రీవార్షిక బ్రహ్మోత్సవాలు ఆగమోక్తంగా వైభవోపేతంగా ప్రారంభమైనాయి. లోకల్ అడ్వైజరి కమిటి సహాయ సహకారాలతో ఐదు రోజులపాటు ఈ బ్రహ్మోత్సవాలు జరిగాయి. నేటి ఉదయం మహా పూర్ణాహుతి, చక్రస్నానం ఘనంగా జరగగా, సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి పుష్పయాగం అంగరంగ వైభవంగా కన్నుల పండువగా జరిగింది. శ్రీవారి చక్రస్నానం కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు డా. కె.లక్ష్మణ్, హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మిరామన్‌గౌడ్, బిజెపి నేత రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. వీరిని టిటిడి లోకల్ అడ్వైజరి కమిటి సభ్యుడు వైటివి త్రినాథబాబు ఘనంగా సత్కరించారు. ప్రతి రోజు వాహనాలపైన శ్రీవారిని పురవీధుల్లో ఊరేగిం చడం, గోవింద నామస్మరణలతో వీధులు, దేవాలయ పరిసర పరిసర ప్రాంతాలు మార్మోగాయి. నిత్యం వేలాది మంది భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. వేలాది మంది భక్తులకు అధికారులు ఉదయం అల్పహారం, మధ్యాహ్నం, రాత్రి అన్నప్రసాద వితరణ గావించారు. టిటిడి లోకల్ అడ్వైజరి కమిటి సభ్యుడు వైటివి త్రినాథబాబు సహకారం అందించగా ఎఇఒ రమేష్‌బాబు, టిటిడి సిబ్బంది విశేషమైన సేవలు అందించారు.

## ప్రొఫెసర్ నగేశ్వర్‌రావు ఒయుకు చేసిన సేవలు గొప్పవి : ఐపిఎస్ ఉమేష్




సీనియర్ ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావును సన్మానిస్తున్న ఓ.యూ ప్రొఫెసర్లు

తార్నాక, మే 31 ప్రభాతవార్త: డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా ఎన్నో సంవత్సరాలుగా సేవలందించిన డా. ఆర్.నాగేశ్వర్‌రావు బుధవారం పదవి విరమణ చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రిన్సిపల్స్, వైస్ చాన్సలర్లు, మాజీ వైస్ చాన్సలర్లు హాజరై ప్రొ.నాగేశ్వర్‌రావుకు పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పిఎఫ్ డిజీపీ ఉమేష్, ఐజీ రమేష్ రెడ్డి హాజరై మాట్లాడుతూ సీనియర్ ప్రొఫెసర్ నగేశ్వర్‌రావు ఓ.యూకు చేసిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. ఆయన వద్ద చదువుకున్న విధ్యార్థులు ఎంతో మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని కొనియాడారు. అనంతరం ప్రొ.నాగేశ్వర్ రావు మాట్లాడుతూ ఓ.యూకు 33 సంవత్సరాల పాటు సేవలందించానని, ఓ.యూ నుంచి 11 దేశాల్లో పర్యటించడం జరిగిందని, ఎన్నో పుస్తకాలను రాశానని చెప్పారు. ఓ.యూలో సుదీర్ఘంగా పనిచేయడం ఎంతో సంతోషాన్ని కల్గించిందన్నారు. రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ, విసి. గోపాల్ రెడ్డి, మాజీ విసి సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాములు, ప్రొఫెసర్లు సాగర్, చంద్రిక, సుధ, అప్పారావు, సమున్నత,ప్రకాష్, వెంకటరత్నం పాల్గొన్నారు.

## ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో మహేష్‌బాబు, కృష్ణ అభిమానుల సందడి

చిక్కడపల్లి, మే 31 ప్రభాతవార్త: సూపర్‌స్టార్ కృష్ణ 80వ జయంతి సందర్భంగా బుధవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని సుదర్శన్ 35ఎంఎం థియేటర్‌లో ఆయన సమర్పించి నటించిన అలనాటి కౌబాయ్ సినిమా మోసగాడు సినిమా విడుదలైంది. ఫస్ట్, సెకండ్‌షోతో పాటు గురువారం నాలుగు షోలు ఈ సినిమా ఆడుతుంది. కాగా కృష్ణ తనయుడు, సూపర్‌స్టాన్ మహేష్ బాబు నటించిన 28వ సినిమా 'గుంటూరు కారం' టీజర్ థియేటర్‌లో అభిమానుల సందడి మధ్య లాంఛనంగా విడుదలైంది. ఉదయం నుంచి డీజేలు ఏర్పాటు చేసిన అభిమానుల సందడి సందడిగా గడిపారు. కృష్ణమహేష్ అభిమాన సంఘాల ప్రతినిధులు రాజేశ్వర్‌రెడ్డి విశ్వ, కిరణ్, రాకేశ్, కృష్ణగౌడ్, సురేశ్, థియేటర్ మేనేజింగ్ పార్ట్‌నర్‌లు బాలగోవింద్‌రాజ్, విశ్వంభర్, మేనేజర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.



# హైదరాబాద్ వార్త

# పెట్రోల్ ఫుల్ ట్యాంక్ కొట్టించొద్దు

### ఇంధనం ఆవిరి * ఎండల్లో కార్లు, బైకులు జాగ్రత్త * లీకేజీలతోనూ వాహనాలకు ముప్పు

**నగర శివారు ప్రాంతంలోని ఒక భారత్ పెట్రోలియంకు చెందిన ఒక బంక్‌లో వాహనంలో పెట్రోల్ పోస్తుండగా మంటలు చెలరేగాయి. ఒక వ్యక్తి సుజికి యాక్సిస్ ద్విచక్రవాహనంపై దూరప్రాంతానికి వెళ్లి వస్తూ మధ్యలో బంకు వద్ద పెట్రోల్ పోయించుకుంటుండగా వేడిగా ఉన్న బైక్ ట్యాంక్ నుంచి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. వెంటనే అప్రమత్తమైన బంక్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు.**





హైదరాబాద్, మే 31 ప్రభాతవార్త : పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వాహనాల ఇంధనంపై ప్రభావం చూపుతున్నాయి. భానుడి భగభగలకు ఇంధనం ఆవిరైపోతోంది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌తో ఒక వైపు తగ్గుతున్న మైలేజీకి తోడు ట్యాంక్‌లో పోస్తున్న ఇంధనం రోజువారీ అవసరాల కోసం ఏ మూలకు సరిపోవడం లేదు. ముఖ్యంగా ఎండల్లో పార్కింగ్‌తో ట్యాంకుల్లోని ఇంధనం వేడెక్కి ఆవిరై గాలిలో కలుస్తోంది. ఫలితంగా వాహనదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఇప్పటికే పెట్రోల్ లీటర్ ధర రూ.109.66ల వరకు వచ్చింది. ప్రతిరోజు ధరల సవరణలతో పెట్రోల్ బంకులకు వెళ్లే వినియోగదారులు అవసరాలకు మించి వాహనాల్లో పెట్రోల్, డీజిల్‌లను పోయించుకోవడం సర్వసాధా రణమైంది. వాహనాల ట్యాంకులు ఉష్ణతాపానికి వేడెక్కి ఇంధనం ఆవిరైపోతుంది. ప్రతిరోజు సగటు వినియో గంలో 20 శాతానికి పైగా పెట్రోల్, డీజిల్ వేడికి ఆవిరై గాలిలో కలుస్తున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.

సూర్యుడు ప్రతా పానికి కార్లు, ఆటోలు, బైక్‌ల నుంచి మంటలు చెలరేగుతున్నాయి. సాధారణంగా వాహనాల్లో వాడుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ మండే స్వభావం కలిగి ఉంటాయి. ఇంధనాలు లీకైనా వేడికి వెంటనే మంటలు వచ్చేందుకు అవకాశం లేకపోలేదు. ఎక్కువ దూరం తిరిగే వాహనాలను తరచూ తనిఖీ చేయకపోవడం వల్ల ప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఏసీ కారులో ప్రయాణాలు సాగి స్తున్న వాహనదారులు మరింత జాగ్రత్తలు తీసుకో వాలని మెకానిక్‌లు సూచిస్తున్నారు. వైరింగ్‌లో నాణ్యత లోపం, ఇంజన్ వేడెక్కడం, అయిల్, డీజిల్, పెట్రోల్, గ్యాస్ లీకేజీలతో మంటలు అంటుకునే అవకాశాలు లేకపోలేదు. వాహనాల్లో నాణ్యతలేని వైర్లు వాడడంతో నిప్పురవ్వలు వచ్చి మంటలు అంటుకునే ప్రమాదమున్నది. • గ్రేటర్ హైదరాబాద్‌లో సుమారు 65.15లక్షల వాహనాలున్నాయి. ఇందులో ద్విచక్ర వాహనాలు సుమారు 44.05లక్షల వరకూ ఉంటాయి • మూడు ప్రధాన అయిల్ కంపెనీలకు చెందిన సుమారు 560 పెట్రోల్, డీజిల్ బంకుల ద్వారా ప్రతి రోజూ 45 లక్షల లీటర్ల పెట్రోల్, 35 లక్షల లీటర్ల డీజిల్ విక్రయాలు సాగుతున్నట్లు చమురు కంపెనీల గణాంకాలు చెబుతున్నాయి • ప్రధాన అయిల్ కంపెనీలు పెట్రోల్ ఉత్పత్తుల నిల్వలపై వాహనదారులకు ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వాహనాల ట్యాంక్‌లో సగం వరకే ఇంధనం నింపాలని స్పష్టం చేస్తున్నాయి. ట్యాంక్‌ను నిండుగా నింపితే ఉష్ణతాపానికి ఆవిరై పోవడంతో పాటు ప్రమాదాలు కూడా సంభవించే అవకాశాలు లేకపోలేదని హెచ్చరిస్తున్నాయి.

**జాగ్రత్తలు ఇలా..**

• వాహనాలను నీడలోనే పార్కింగ్ చేయాలి. ఇంజన్‌కు సరిపడా అయిల్ ఉండేట్లు చూడాలి. ఎండల వేడికి ఇంజన్ అయిల్ త్వరగా పల్చబడిపోతుంది. వేసవిలో ఇంజిన్ గార్డులు తొలగించడం మంచిది. దూర ప్రయాణాలు చేసేవారు మధ్య మధ్యలో వాహనాన్ని ఆపి కొద్దిసేపు ఇంజన్‌కు విశ్రాం తినివ్వాలి • వాహనాల పెట్రోల్ ట్యాంక్‌పై దళసరి కవర్ ఉండేటట్లు చూడాలి. కవర్లు వేడెక్కకుండా ఉండేందుకు వెల్‌వెట్, ఫోమ్ క్లాత్ సీట్ కవర్లు వాడాలి • వేసవి కాలంలో పెట్రోల్ ట్యాంకులో గ్యాస్ ఏర్పడే అవకాశం ఉంటుంది. ఇందుకోసం రాత్రి సమయంలో బైక్‌ను పార్క్ చేసేటప్పుడు ఒక్కసారి ట్యాంక్ మూతను తెరచి మూసి వేయాలి • నగర శివారు ప్రాంతంలోని ఒక భారత్ పెట్రోలియంకు చెందిన ఒక బంక్‌లో వాహనంలో పెట్రోల్ పోస్తుండగా మంటలు చెలరేగా యి. ఒక వ్యక్తి సుజికి యాక్సిస్ ద్విచక్రవాహనంపై దూరప్రాంతానికి వెళ్లి వస్తూ మధ్యలో బంకు వద్ద పెట్రోల్ పోయించుకుంటుండగా వేడిగా ఉన్న బైక్ ట్యాంక్ నుంచి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. వెంటనే అప్రమత్తమైన బంక్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

## నూతన విద్యా విధానంలో నైపుణ్యం చాలా ముఖ్యం

చార్మినార్, మే 31 ప్రభాతవార్త : విద్యతో పాటు ఉపాధి కల్పన నూతన విద్యా విధాన ఉద్దేశ్యమని కేంద్ర ప్రభుత్వ పూర్వ కార్యదర్శి సీనియర్ ఐఎఎస్ అధికారి రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాలలో గత సంవత్సరం రిటైల్ సెక్టార్ సంస్థల సహకారంతో తొలి సారిగా బిబిఎ రిటైలింగ్ కోర్సును ప్రవేశ పెట్టారు. కోర్సు మొదటి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా పాతబస్తీలోని ప్రభుత్వ సిటీ కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా నూతన విద్యా విధానంలో నైపుణ్యం చాలా ముఖ్యమని, నైపుణ్యంతో పాటు ఉన్నత విద్యార్జనకు ప్రాముఖ్యత ఉందని తెలిపారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య ఆర్.లింబాద్రి మాట్లాడుతూ సిటీ కళాశాలలో ప్రవేశ పెట్టిన కోర్సులను 23-24 విద్యా సంవత్సరంలో మరిన్ని కళాశాలలో ప్రవేశ పెడతామని తెలియజేశారు. కార్యక్రమంలో సెక్టార్ కౌన్సిల్ ప్రతినిధి సుబ్బారావు, ఎజిఒ డి.డి.టి.చారి, సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాలభాస్కర్, రిటైల్ రంగ ప్రతినిధితో పాటు పలువురు పాల్గొన్నారు.

## మన తెలంగాణ రాష్ట్ర సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ శరత్‌బాబు

చిక్కడపల్లి, మే 31 ప్రభాతవార్త: మన తెలంగాణ రాష్ట్ర సమితి(మన టిఆర్ఎస్) పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ శరత్‌బాబును ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు టైగర్ పోతు అశోక్ నియమించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో వరంగల్ జిల్లాకు చెందిన శరత్‌బాబు వంద మంద కార్యకర్తలతో పార్టీలోకి చేరడంతో పార్టీ అధినేత కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు టైగర్ అశోక్ మాట్లాడుతూ శరత్‌బాబు అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడంతో పాటు అంతర్జాతీయ మదర్‌థెరిస్సా అవార్డు, జాతీయ గ్లోబల్ అచీవర్ అవార్డులను అందుకున్నారన్నారు.

## ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బోరబండ పోలీసుస్టేషన్




యూసుఫ్‌గూడ, మే 31, ప్రభాతవార్త : బోరబండలో నూతన పోలీస్ స్టేషన్ అన్ని హంగులతో సిద్ధమైంది. ఇప్పటి వరకు బోరబండ సైట్ 2 కాలనీలో కొనసాగిన ఔట్‌పోస్ట్ ఇక నుంచి ఠాణాగా మారనున్నది. జూన్ 2న దీన్ని ప్రారంభించడానికి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. 10రోజుల క్రితమే బోరబండ ఠాణాకు కేటాయించిన వాహనాలు ఇక్కడికి చేరుకున్నాయి. ఈ నూతన పోలీస్‌స్టేషన్‌కు తొలి స్టేషన్ హౌస్ అఫీసర్‌గా కామల్ల రవికు మార్ ఇప్పటికే బాధ్యతలు తీసుకున్నారు. ఎస్సార్‌నగర్ ఠాణా పరిధికి చెందిన బోరబండ పోలీస్ ఔట్‌పోస్ట్‌కు దాదాపు 40 ఏండ్ల చరిత్ర ఉన్నది. విశాలమైన ప్రాంగణంలో ఉన్న ఔట్‌పోస్ట్ స్థానంలో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటుచేయాలని ఐదారు నెలల క్రితం పోలీస్ శాఖ నిర్ణయించింది. పశ్చిమ మండలంలోని ఎస్సార్‌నగర్ డివిజన్ పరిదిలోని బోరబండ ఠాణా వస్తుంది. బోరబండ పూర్తి డివిజన్‌తో పాటు ఎర్రగడ్డ డివిజన్‌లోని సగం ఏరియా, గతంలో జూబ్లిహిల్స్ ఠాణా పరిదిలో ఉన్న రహ్మత్‌నగర్ డివిజన్‌లోని హిల్స్ బస్తీలు బోరబండ పోలీస్‌స్టేషన్ పరిదిలో చేర్చటం జరిగింది. ముసాపేట డివిజన్‌కు చెందిన బీఎస్పీ(బాలాజి స్వర్ణపురి) కాలనీ కూడా, మొత్తానికి 3.5 లక్షల జనాభా బోరబండ ఠాణా పరిదిలో ఉంటుందని అంచనా వేశారు. ఇక నూతన ఠాణా ప్రాంగణాన్ని తీర్చిదదిద్దే పనులు పూర్తయ్యాయి. పోలీస్ ఇన్స్‌పెక్టర్ చాంబర్, సిసి టీవీల గది, వాహనాల పార్కింగ్ ఏరియా తదితర వాటిని పూర్తి చేశారు. బోరబండ నూతన ఠాణా సిబ్బంది వివరాలను ఎస్‌హెచ్‌ఓ రవికుమార్ వివరించారు. మొత్తం 4సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు.

## ఘనంగా అహిల్యా భాయి హోల్కర్ జయంతి




అహిల్యా భాయి జయంతి వేడుకల్లో పాల్గొన్న జేపీసీ నాయకులు కొంగల పాండు కురువ

తార్నాక, మే 31 ప్రభాతవార్త: ఓ.యూ జెఏసీ నాయకులు కొంగల పాండు కురువ ఆద్వర్యంలో లోకమాత అహిల్యా భాయి హోల్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి మాట్లాడుతూ అహిల్యా భాయి గొర్ల కాపరి నుంచి అంచెలంచెలుగా ఎదిగి మహా మరాఠా సామ్రాజ్యానికి రాణిగా ఎదిగారని కొనియాడారు. పేదల కోసం గొప్ప సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, మహిళా ఆర్మీని ఏర్పాటు చేసిన గొప్ప నాయకురాలని కొనియాడారు. అనంతరం కొంగర పాండు కురువ మాట్లాడుతూ సనాతన ధర్మ రక్షణార్థం దేశవ్యాప్తంగా వేలాదిగా శివాలయాలను నిర్మించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అహల్యా భాయి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోశిక శ్రీనివాస్ కురుమ, మంత్రి కళావతి, శంకరోళ్ల రవి, గణం నర్సింహాం, నర్రి స్వామి, వన్నాడివ రమేష్, ప్రసన్న మహేష్, జక్కుల అనిల్, వినయ్, సతీష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలకు రిహార్సల్స్ చేస్తున్న పోలీసులు

## క్రీడలకు పెద్దపీట వేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

### విద్యాశాఖా మంత్రి సబితా ఇంద్రారెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

గచ్చిబౌలి, మే 31 ప్రభాతవార్త: క్రీడలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించి క్రీడల్లో రాణించేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రోత్సహిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్రస్థాయి విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు మంత్రి పతకాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని, ఓటమి గెలుపుకు నాంది అవుతుందన్నారు. కసితో ఓటమిని విజయంగా మార్చుకునే శక్తి ఒక్క క్రీడాకారునికే ఉంటుంద న్నారు. తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారి గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ రకాల క్రీడాపోటీలు నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నామని, ముఖ్యమంత్రి కెసిఆర్ క్రీడల కోసం సబ్ కమిటీని ఏర్పాటు చేశారన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు రాణించే విధంగా నూతన క్రీడా పాలసీని రూపొందిస్తున్నట్లు తెలిపారు. విశ్వవేదికపై సత్తా చాటుతున్న క్రీడాకారులకు ముఖ్యమంత్రి కెసిఆర్ సముచిత గౌరవం ఇస్తున్నారని, ప్రోత్సాహకాలను అందిస్తున్నారని అన్నారు. క్రీడాకారులకు ఈ ప్రోత్సాహం మరింత ప్రేరణగా నిలుస్తుందన్నారు. ప్రతి గ్రామంలో క్రీడలు అడేందుకు క్రీడా మైదానాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించిన అధికారులను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా హాకీలో సంగారెడ్డి జట్టు విజేతలుగా నిలువగా, నిజామాబాద్ రెండవ స్థానంలో నిలిచింది. మహిళల ఫుట్‌బాల్‌లో ఖమ్మం జట్టు గెలుపొందగా, నల్గొండ రన్నర్స్‌గా నిలిచారు. బాలుర ఫుట్‌బాల్‌లో హైదరాబాద్ జట్టు మొదటిస్థానం దక్కించుకోగా, గద్వాల్ జట్టు రెండవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్రీడాశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఒక్కసారిగా మారిన వాతావరణం

### నగరంలో భారీ వర్షం





హైదరాబాద్, మే 31 ప్రభాతవార్త : నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారింది. బుధవారం మధ్యాహ్నం వరకు భగభగలతో అల్లాడిపోయిన భాగ్యనగరం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో వివిధ ప్రాంతాల్లో కురిసిన వర్షంతో ఎండాకాల పరిస్థితుల నుంచి స్థానికులకు కొంత ఉపశమనం లభించింది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం సూచన మేరకు రాబోయే రెండు రోజులు నగరంలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. జూబ్లీ హిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, కూకట్‌పల్లి, అమీర్‌పేట్, బాలానగర్ తదితర పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీయడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్ల మీదకు భారీగా వర్షపు నీరు చేరడంతో ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత కొద్ది రోజులుగా ఎండ వేడి, ఉక్కపోతతో అల్లాడుతున్న జనం వర్షం కారణంగా కాస్త ఉపశమనం పొందారు. మరోవైపు నైరుతి రుతుపవనాలు జూన్ 7 నుంచి 11 మధ్య తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉందని, భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనాలో తెలిపింది. రుతుపవనాల రాకతో మొదట్లో వర్షాలు తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది.

## మహిళ మెడలోంచి 2.4 తులాల గొలుసు చోరీ

హాయత్‌నగర్, మే 31 ప్రభాతవార్త: హాయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం చైన్‌స్నాచింగ్ జరిగింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోంచి 2.4 తులాల బంగారు గొలుసును దుండగుడు అపహరించుకుపోయాడు. వివరాలు.. నందిని హిల్స్‌కు చెందిన లక్ష్మి కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తుంటుంది.

బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఆమె తన కుమార్తెతో కలిసి ప్రగతి నగర్‌లో టైలర్ షాపుకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తోంది. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి ఆమె మెడలోంచి 1.25 లక్షల రూపాయల విలువైన 2.4 తులాల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. లక్ష్మి వెంటనే అవరడంతో అప్రమత్తమైన అక్కడి వ్యక్తులు దుండ గుడిని పట్టుకునేందుకు యత్నించినా వారిని తప్పించు కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఎమ్మెల్యే సాయన్న నిధుల ద్వారా మంజూరైన

## పనుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : లాస్య నందిత



రెజిమెంటల్ బజార్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న మాజీ కార్పొరేటర్ లాస్య నందిత తదితరులు

కంటోన్మెంట్, మే 31 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం దివంగత ఎమ్మెల్యే సాయన్న నిధుల ద్వారా మోండా డివిజన్‌లో కోటి 80 లక్షల నిధులు మంజూరైయ్యాయని, వాటి పనులకు శ్రీకారం చుట్టేందుకు ఏర్పాట్లు సిద్ధమైయ్యాయని దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు మాజీ కార్పొరేటర్ లాస్య నందిత తెలిపారు. బుధవారం మోండా డివిజన్ లోని రెజిమెంటల్ బజార్‌లోని రెజిమెంటల్ బజార్ వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ఏరులై పారుతున్న డ్రైనేజీ, అధ్వాన్నంగా ఉన్న రోడ్ల మరమ్మత్తులకు శాశ్వత మరమ్మత్తు చేపట్టేందుకు నిధులు మంజూరైయ్యాయని, అభివృద్ధి పనులు వేగవంతంగా చర్యలు చేపట్టాలని జలమండలి ఎండి దాన కిషోర్‌లతో చర్చించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఏఈ రవిందర్, మాజీ కో-అప్షన్ సభ్యుడు నర్సింహ్మా ముదిరాజ్, బిఆర్‌ఎస్ నేతలు పనస సంతోష్, అశోక్, సదానంద్ గౌడ్, దాసరి కర్ణకుమార్, అశోక్, రాంమోహన్, సృజన్ ముదిరాజ్, కాశిరెడ్డి, పంగ రాజయ్య, ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.

## అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలకు క్లీనింగ్ పరికరాన్ని అందజేసిన బిజెపి నేతలు



అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలకు క్లీనింగ్ పరికరాన్ని అందజేస్తున్న బిజెపి నేతలు ఉదయ్ యాదవ్, కన్నాభిరామ్, మంద ఎసురేశ్, హాంసరాజ్

అడ్డగుట్ట, మే 31 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉపయోగించే మూత్రశాలలు మరింత పరిశుభ్రంగా ఉండేందుకు కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ జి.కిషన్ రెడ్డి నిధుల ద్వారా అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలకు విడుదలైన హై ప్రెసర్ క్లీనింగ్ పరికరాన్ని బుధవారం అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్‌కు అడ్డగుట్ట బిజెపి నేతలు అందజేశారు. మూత్రశాలల ద్వారా తోటి విద్యార్థులకు అంటువ్యాధులు ప్రభల కుండా ఎంపీ నిధుల ద్వారా మం జూరైన హై ప్రెసర్ క్లీనింగ్ పరికరాన్ని పాఠశాల యాజమా న్యం సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని బిజెపి నాయ కులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షుడు అంబాల మహేశ్, బిజెవైఎం అధ్యక్షుడు గెల్లు ఉదయ్ యాదవ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సి.హెచ్. కన్నాభిరామ్, బిజెపి నాయకులు జి.హంసరాజ్, కళావతి, వీరేశం, నర్సింహ్మా, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్టలో మాజీ ఎమ్మెల్యే పాదయాత్ర



పాదయాత్రలో అభివాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల, మే31 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని దేవమ్మ బస్తీ, సంజయ్‌పురి కాలనీ, బస్టాప్, అంజయ్య నగర్ బస్తీలలో బుధవారం మాజీ ఎమ్మెల్యే, బీజేపి రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ పాదయాత్ర నిర్వహించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ గత మూడేళ్ళుగా ప్రతి పేదవాడికి 5కిలోల బియ్యం కేంద్రమే ఉచితంగా అందిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం బియ్యం పంపిణీని నిలిపివేసిందన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కేసీఆర్, ప్రశ్నా పత్రాలను లీక్ చేసి యువత భవిష్యత్తుతో ఆటలాడుతున్నాడని తీవ్రంగా మండిపడ్డారు. నియోజకవర్గం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ జగద్గిరిగుట్టలో నూతన బస్సు డిపో, కళాశాల, బస్తీ దవాఖాన ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్ చేస్తున్న మోసాలను గమనించి రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని, బీజేపి పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెకెఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్, బీజేపి ఓబీసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యు డు జేకే శేఖర్‌యాదవ్, బీజేపి నాయకులు పున్నారెడ్డి, గరిగె శేఖర్ ముదిరాజ్, సురేష్‌రెడ్డి, సుధా, సిద్ధిరాంరెడ్డి, అరుణారెడ్డి, వసుంధర, రాజుయాదవ్, శ్రవణ్, గీత, అరుణ్, స్థానికులు పాల్గొన్నారు.

## తెంగాణ అవతరణ దశాబ్ధి ఉత్సవాల ఏర్పాట్లపై కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్

కొంపల్లి, మే31 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహిం చేందుకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కౌన్సిల్ సమావేశంలో 21రోజుల పాటు నిర్వహించే తెలంగాణ దశాబ్ధి ఉత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో అమర వీరుల స్థూపాల అలంకరణ, లైటింగ్స్, హోర్డింగ్స్, కరపత్రాలు, రంగోలి కార్యక్రమాలపై చర్చించారు. అదే విధంగా నాడు-నేడు తెలంగాణలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసే విధంగా హోర్డింగ్‌స, ఫ్లెక్సీల ఏర్పాటు తదితర అంశాలపై సన్న శ్రీశైలంయాదవ్ చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, కమిషనర్ శ్రీహరి, మేనేజ్ శ్రీనివాస్‌గౌడ్, జూనియర్ అసిస్టెంట్ రంజిత్‌కుమార్, వార్డు కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పి.వి.నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయంలో పాలిటెక్నికల్ కోర్సుల ప్రవేశాలు

మైలార్‌దేవ్‌పల్లి, మే 31 ప్రభాతవార్త : పి.వి.నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను రెండు సంవత్సరాల పాలిటెక్నికల్ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేయటం జరిగింది. ఈ కోర్సులో ప్రవేశం కొరకు పదివ తరగతి ఉత్తీర్ణులై మరియు టిఎస్ పాలిటెక్నికల్ 2023 ప్రవేశ పరీక్షలో (అగ్రికల్చర్ స్ట్రీమ్) ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. పి.వి.నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలో నాలుగు పశు సంవర్ధక పాలిటెక్నికల్ కళాశాలలు ఉన్నాయి. మహబూబ్, మామునూర్ (హనుమకొండ జిల్లా ), సిద్దిపేట్ మరియు కరీంనగర్ జిల్లాలలో మొత్తం 121 సీట్లు ఉన్నాయి. ఈ కళాశాలలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా బావదేవరపల్లిలోని మత్స్య శాస్త్ర పాలిటెక్నికల్‌లో 11 సీట్లు కలవు. ఈ కోర్సులలో చేరటానికి ఆసక్తి గల విద్యార్థులు జూన్ నెల 19వ తేదీ లోపు విశ్వవిదా ్యలయం యొక్క వెబ్‌సైట్ ద్వారా అప్లికేషన్‌ను పంపించవచ్చునని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎం.జ్ఞాన ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు.

## తెలుగు విశ్వవిద్యాలయ కోర్సుల ప్రవేశ ప్రకటన

నాంపల్లి, మే 31 ప్రభాతవార్త : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతీయేటా నిర్వహించే వివిధ కోర్సులకు సంబంధించిన ప్రవేశ ప్రకటనను బుధవారం విడుదల చేశారు. 2023-24 విద్యా సంవత్సరానికిగాను విశ్వవిద్యాలయం నిర్వహించే రెగ్యులర్ కోర్సులలో ప్రవేశం కల్పించడానికి అర్హత కలిగిన విద్యార్థుల నుండి దరఖాస్తులను కోరుతున్నారు. శిల్పం, చిత్రలేఖనం, డిజైన్స్, లైబ్రరీసైన్స్, సంగీతం, రంగస్థలం, నృత్యం, జానపదం, తెలుగు, చరిత్ర, పర్యాటకం, భాషాశాస్త్రం, జర్నలిజం, జ్యోతిషం, యోగా తదితర అంశాలలో పొట్టి తెలుగు శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పి.జి; యు.జి; పి.జి డిప్లమా; డిప్లమా; సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తుంది. ఆయా కోర్సులలో ప్రవేశం పొందగోరే ఆసక్తిగల అభ్యర్థుల నుండి విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులను కోరుతున్నారు. దరఖాస్తులను జూన్ 16లోగా, ఆలస్య రుసుముతో జూన్ 30వ తేదీలోగా విశ్వవిద్యాలయానికి సమర్పించ వలసిందిగా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ తెలిపారు. **2022-24 పిహెచ్‌డి ప్రవేశాలు..** భాషాశాస్త్రం, సంగీతం, నృత్యం, రంగస్థలం, జానపదం, జర్నలిజం, చరిత్ర, సంస్కృతి, పురావస్తు శాస్త్రం, జానపద గిరిజన విజ్ఞానం అంశాలలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2023-24 విద్యా సంవత్సరానికి పిహెచ్‌డి ప్రోగ్రాంలలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థుల నుండి దరఖాస్తులను కోరుతున్నారు. పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.తెలుగుయూనివర్సిటీ.ఎసి.ఇన్ లేదా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.పిఎస్‌టియుసెట్.ఆర్గ్ (ఓఆర్‌జి)లను సంప్రదించవచ్చునని రిజిస్ట్రార్ తెలిపారు.

## పొగాకు దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 5కె రన్



5కె రన్‌లో పరుగులు తీస్తున్న ఔత్సాహికులు

నిజాంపేట్, మే31 ప్రభాతవార్త: పొగాకు దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బుధవారం ఎస్‌ఎల్‌జీ ఆసుపత్రి యాజమాన్యం 5కె రన్‌ను నిర్వహించారు. ఈ 5కె రన్‌లో 5 సంవత్సరాల నుంచి 80ఏళ్ళ మధ్య ఉన్న వయస్సుల వారు సుమారు 800మంది పైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీఎస్ సోమరాజు మాట్లాడుతూ ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పొగాకు వాడటం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 5కె రన్‌ను నిర్వహించామన్నారు. మన దేశంలో పొగాకును సిగరెట్లు, చుట్టలు, గుట్కా, తంబా తదితర రూపాల్లో ప్రజలు ఉపయోగిస్తున్నారని, వీటిని తినడం వల్ల గెండె సమస్యలు, నాడీ, మూత్ర పిండాలు, ఊపిరితిత్తుల సమస్యలు వా ్యధులు వస్తాయని, వాటికి ఎంత దూరంగా ఉంటేమనం అంత ఆరోగ్యంగా ఉంటామన్నారు.

## ఉచిత కర్ర కత్తి సాము శిక్షణా శిబిరం



కర్ర, కత్తి సాము ఉచిత శిక్షణా శిబిరంలో శిక్షణ పొందుతున్న ఔత్సాహికులు

నాంపల్లి, మే 31 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, స్వర్ణ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాదాపూర్‌లో 45 రోజులపాటు ఉచిత కర్ర, కత్తి సాము శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఆశిక్, స్వర్ణయాదవ్‌లు మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్రసాము అనేది పిల్లలకు ఆటవిడుపుగా నేర్చుకున్నప్పటికీ వారికి తెలియకుండానే ఇదొక ఆత్మరక్షణ కళ, ఇంద్రియాలను నియంత్రించుకునేటటువంటి అద్భుత మైన కళ అని స్పష్టం చేశారు. కర్రసాము శారీరకంగానే కాకుండా మానసికంగా చురుకుగా ఉండేందుకు, ఏకాగ్రత పెంచేందుకు సహాయపడుతూ పిల్లల్ని చైతన్యవంతుల్ని చేస్తుందన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే మన శరీరంలో అన్నిభాగాలకు ఒకేసారి వ్యాయామం దీని ప్రత్యేకత అని వివరించారు. ఉచిత శిక్షణ పొందదలచిన ఔత్సాహికు లు పూర్తి వివరాల కోసం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మాదాపూర్‌లో, 9705917455లో సంప్రదించవ చ్చునని, ఈ సదవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు.

## అర్హులందరికీ కల్యాణలక్ష్మీ పథకం వర్తింపు: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్





కల్యాణలక్ష్మీ చెక్కులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, చిత్రంలో కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ తదితరులు

హైదరాబాద్, మే 31 ప్రభాతవార్త : అర్హులైన ప్రతి ఒక్కరికీ కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాన్ని వర్తింపచేస్తామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం హిమాయత్‌నగర్ తహశీల్దార్ కార్యాలయంలో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్‌తో కలిసి కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణి చేశారు. 33 మంది లబ్ధిదారులకు ఒక్కక్కరికి రూ.1,00,116లు చొప్పున రూ.33,03,828లు విలువగల చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం కెసిఆర్ ఆశీస్సులతో రాష్ట్ర ప్రభుత్వం అందించే కళ్యాణలక్ష్మీ పథకం పేదింటి ఆడబిడ్డలకు వరం లాంటిదని అన్నారు. ఇది పెళ్లి సమయంలో వధువు కుటుంబానికి పెళ్లి ఖర్చుల కోసం స్వంత కుటుంబ సభ్యుడిగా సిఎం కెసిఆర్ అందిస్తున్న కానుక అని తెలిపారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సిఎం కెసిఆర్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు కన్నె రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**సంజీవయ్యనగర్ సమస్యలు తీరుస్తా..** నల్లకుంట డివిజన్ పరిధిలోని సంజీవయ్యనగర్ బస్తీ సమస్యలు తీరుస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం సంజీవయ్యనగర్ బస్తీలలో పర్యటించి స్థానికులకు ఆయన పై హామీ ఇచ్చారు. స్థానికంగా త్రాగు నీరు తగినంతగా సరఫరా లేకపోవడం, లోప్రెషర్ సరఫరా, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ వైర్లు పాడవడం వంటి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి వచ్చాయి. వెంటనే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే సంజీవయ్యనగర్‌లో సిసి రోడ్డు కూడా వేయిస్తామని హామీ ఇచ్చారు.

### క్యూ నెట్ చెందిన ముగ్గురు వ్యక్తులను

## పోలీసులు అరెస్టు చేయడం పట్ల హర్షం

**బాధితులకు వీలైనంత త్వరగా డబ్బులు ఇప్పించాలి: డాక్టర్ దిడ్డి సుధాకర్ విజ్ఞప్తి**

సైఫాబాద్, మే 31 ప్రభాతవార్త: మోసపూరిత మార్కెటింగ్ పద్దతుల కేసులో క్యూ నెట్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను సెంట్రల్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేయడంపై ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటి సభ్యుడు, క్యూ నెట్ బాధితుల జెఎసి కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు. క్యూ నెట్ పేరుతోనే కాకుండా విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో మళ్ళీ నిరుద్యోగులను దోచుకుంటున్న వారిని సిసిఎస్ పోలీసులు గుర్తించి పట్టుకుని విహాన్‌కు చెందిన 35 బ్యాంకు ఖాతాలలో 54 కోట్లు స్తంభింపజేయడం అభినందనీయమన్నారు. క్యూ నెట్ నిందితులు సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో వీ-ఎంపైర్ పేరుతో 50000 నుంచి 1.5 లక్షల వరకు పెట్టుబడులు పెట్టిన వారికి నెలకు 20 వేల నుంచి 60 వేలు వరకు ఇస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగ యువతను, అమాయక ప్రజలను ప్రలోభపెట్టి కోట్ల రూపాయల డబ్బులు వసూలు చేసి మోసం చేశారని ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ భారీ మోసంపై గతవారం క్యూ నెట్ బాధితుల జెఎసి సిసిఎస్‌లో ఫిర్యాదు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరడం జరిగిందన్నారు. వీలైనంత త్వరగా బాధితులకు డబ్బులు ఇప్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### తెలుగు దేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటి

## అధికార ప్రతినిధిగా డాక్టర్ ఎ.ఎస్ రావు నియామకం

బేగంబజార్, మే 31 ప్రభాతవార్త: తెలుగు దేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటి అధికార ప్రతినిధిగా డాక్టర్ ఎ.ఎస్ రావు నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించిన తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు దన్యావాదాలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అధ్యక్షులు కాసాని జా ్ఞనేశ్వర్ ముదిరాజ్ సహకారంతో ముందుకువెళ్తనన్నారు.

### కనీస వేతనాల సలహా బోర్డులో అన్ని

## సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి

సైఫాబాద్, మే 31 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జివో నెంబరు 14 ను విడుదల చేసి బిఆర్‌ఎస్ పార్టీకి అనుబంధంగా ఉన్న టిఆర్‌ఎస్‌కెవికి సంబంధించిన వారిని అత్యధికంగా కార్మిక శాఖ కనీస వేతనాల సలహా బోర్డులోకి ప్రకటించడాన్ని ఎఐటియుసి తీవ్రంగా నిరసన వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం ఎఐటియుసి జాతీయ నాయకురాలు డా.బి.వి.విజయలక్ష్మి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి యూసఫ్, ఎస్.బాల్‌రాజ్ కార్మిక శాఖ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ రాణికుముదినికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 103 సంవత్సరాలు చరిత్ర కలిగిన ఎఐటియుసి నుంచి సలహా బోర్డులో సభ్యులుగా నియమించకపోవడాన్ని తప్పుపట్టారు. అన్ని కార్మిక సంఘాల సభ్యులను సలహా బోర్డులో నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఇందుకోసం తక్షణమే జివోను సవరించాలని లేని పక్షంలో ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

## బంధు సొసైటీ, మాదిగ మేధావుల ఫోరం సమావేశం

చిక్కడపల్లి, మే 31 ప్రభాతవార్త: బంధు సొసైటీ(హైదరాబాద్), మాదిగ మేధావుల ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో బంధ్ సొసైటి ప్రధాన కార్యదర్శి పల్లెల వీరాస్వామి సతీమణి స్వర్గీయ పల్లెల సుశీల సంతాప సభ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో విశ్రాంత ఐఆర్‌టిఎస్ అధికారి భరత్‌భూషణ్, ఎన్‌టిపిసి విశ్రాంత డీజీఎం డాక్టర్ ఆరేపల్లి రాజేందర్, విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి యు.విజయకుమార్, ఎస్.రాజలింగం, ప్రొఫెసర్ ఏకు తిరుపతి, ప్రొఫెసర్ మేడి రమణ, ప్రొఫెసర్ పురుషోత్తం, సిపిఎం నేత బిక్షమయ్య, జాన్ దర్శన్, ఎన్‌ఆర్‌ఐ ఎం.శ్రీనివాస్, మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, బొజ్జ భిక్షమయ్య, ప్రముఖ రచయిత డాక్టర్ పసునూరి రవీందర్, జైభీం సంఘం(ఉప్పల్) నేత నల్లబాబు, సామాజికవేత్త దయానంద్, పల్లెల వీరస్వామి కుటుంబ సభ్యులు డాక్టర్ వసంత, కె.రమేశ్‌బాబు, నంద్ర రాము, ఎంసి.హృదయనాథ్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. బహుజన ఉద్యమాలకు చేదోడువాదోడుగా ఉంటూ ముందుకు నడిచిన గొప్ప మహిళ పల్లెల సుశీల అని కీర్తించారు.

### పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

పేట్‌బషీరాబాద్, మే31 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని సరోజినీ గార్డెన్స్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు కుంట సిద్ధిరాములు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, దేశంలో ఏ రా ష్ట్రం లేని విధంగా తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, పార్టీ అభివృద్ధికై కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో విపక్షాలు సరైన బుద్ధి చెప్పే విధంగా కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్‌రావు, సంపత్ మాధవరెడ్డి, గుమ్మడి మధుసూధన్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సీఎంకు ధన్యవాదాలు తెలిపిన గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం



సభ వద్ద గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

జీడిమెట్ల, మే31 ప్రభాతవార్త: గోపాన్‌పల్లిలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా విప్రహిత బ్రాహ్మణ సేవా సదన్ ప్రారంభోత్స వాత్సవ కార్యక్రమానికి బుధవారం గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ ధూప, దీప, నైవేద్యాలకు రూ.6వేల నుంచి 10వేలకు పెంచిన ముఖ్య మంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## విద్యా దానం గొప్పది



దరఖాస్తు పత్రాలను అందచేస్తున్న జి.జి.వై.ఎఫ్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్

బేగంబజార్, మే 31 ప్రభాతవార్త: అన్ని దానాల కన్న విద్యా దానం గొప్పదని నినాదంతో ముందుకు సాగుతూ గడ్డం గంగాధర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోషామహల్ నియోజకవర్గంలోని నిరుపేద విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా ఇంటర్, డిగ్రీ, పిజి విద్యను అందించేందుకు శ్రీకారం చుట్టినట్లు ఫౌండేషన్ చైర్మన్, బిఆర్‌ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. గౌలిగూడలోని ఫౌండేషన్ కార్యాలయంలో రెండవ ధపా ధరఖాస్తు తీసుకుని అందచేసిన ధరాఖాస్తులను అడ్మిషన్‌కు సంబంధించి కసరత్తు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గం లో నిరుపేదలు, అధికంగా ఉన్నట్లు తెలిపారు. ఈసంవత్సరం ఇంటర్, డిగ్రీ, పిజి విద్యార్థినీ, విద్యార్థుల నుంచి ఉచిత విద్య కోసం ధరఖాస్తులను పంపిణి చేసి, తీసుకోవడం జరుగుతుందన్నారు. తల్లి దండ్రులు తమ పిల్లల ఉన్నతమైన భవిష్యత్తు కోసం కళాశాలలో ఉచిత విద్యను ఉపయోగించుకోవాలన్నారు.

### చిక్కడపల్లి వార్డు కార్యాలయంలో రాష్ట్ర అవతరణ శతాబ్ది ఉత్సవాలు

చిక్కడపల్లి, మే 31 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర అవతరణ శతాబ్ది ఉత్సవాలను జూన్ 2న ఘనంగా నిర్వహించబోతున్నట్లు జిహెచ్‌ఎంసి సర్కిల్-15 డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య వివరించారు. ఆ రోజు ఉదయం ఏడున్నర గంటలకు చిక్కడపల్లి మెట్రోస్టేషన్ పక్కనే ఉన్న చిక్కడపల్లి వార్డు కార్యాలయంలో ఈ వేడుకలు జరుగుతాయని, జిహెచ్‌ఎంసి సర్కిల్-15కు చెందిన అధికారులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది విధిగా రావాలని సూచించారు.

# అంబర్‌పేటలో పండుగ వాతావరణంలో దశాబ్ధి ఉత్సవాలు



కెసిఆర్ ప్రభుత్వ అభివృద్ధిపై రూపొందించిన ఆడియో, వీడియోలను ఆవిష్కరిస్తున్న టిఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి, చిత్రంలో గరిగంటి రమేష్, మురళీకృష్ణ తదితరులు

ఎడ్ల సుధాకర్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 ప్రభాతవార్త : జూన్ 2 నుంచి ప్రారంభం కానున్న దశాబ్ధి ఉత్సవాలను అంబర్‌పేట నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో నిర్వహిస్తామని నియోజకవర్గం ఇన్‌చార్జీ ఎడ్ల సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం అంబర్‌పేట చే నెంబర్‌లోని బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రూపొందించిన ఆడియో, వీడియోలను ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధా కర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ తొమ్మిదేండ్ల కాలంలో ప్రపంచం లోనే ఎక్కడాలేని విధంగా వినూత్న పథకాలు అమలు చేస్తూ అన్ని రంగాల్లో రాష్ట్రం అద్భుత 'ప్రగతి సాధించిందన్నారు. సిఎం కెసిఆర్ ఇచ్చిన పిలుపులో భాగంగా అంబర్‌పేట నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు దశాబ్ధి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేందుకు రెండు ప్రచార రథాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సిఎం కెసిఆర్ పిలుపు మేరకు నియోజకవర్గంలో రైతు దినోత్సవ వేడుకలు, విద్యుత్ విజయోత్స వేడుకలు, పారిశ్రామిక వేడుకలు సాగునీటి దినోత్సవం, సాంస్కృతిక వేడుకలు, సంక్షేమ పథకాల సభలు, తెలంగాణ సుపరిపాలన వేడుకలు, సాహిత్య దినోత్సవం వేడుకలు, తెలంగాణ రన్, మహిళా సంక్షేమ దినోత్సవం వేడుకలు, వైద్య ఆరోగ్య వేడుకలు, పల్లె ప్రగతి దినోత్సవ వేడుకలు, పట్టణ ప్రగతి దినోత్సవం, గిరిజన దినోత్సవ వేడుకలు, మంచినీటి పం డుగ, హరిత దినోత్సవ వేడుకలు, తెలంగాణ విద్యా దినోత్సవం, అధ్యాత్మిక దినోత్సవ వేడుకలు, అమరవీరులకు నివాళులు కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎడ్ల సుధాకర్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారులు, అభిమానులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పులి జగన్, గ్రేటర్ బిఆర్‌ఎస్ నాయకులు గరిగంటి రమేష్, కె.మురళీకృష్ణ, బి.నాగేష్‌గౌడ్, జీవన్‌గౌడ్, దేవిరెడ్డి విజితారెడ్డి, జెడి రాహుల్, ఎం.జనార్ధన్, చందర్ చారి, దిలీప్‌కుమార్, బాబా, గౌస్‌పాషా, ప్రకాష్‌రెడ్డి, పి.శంకర్, ఖలీద్, యూసుఫ్, లక్ష్మీ, సూర్యలోక్మా, దయానంద్, దేవేందర్, కనకయ్య, భూషణ్ తదితరులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు జవహర్‌నగర్ కమ్యునిటీ హాల్‌లో వార్డు ఆఫీస్ ఏర్పాటు ఉపసంహారణ

**ఫలించిన జవహర్‌నగర్ కాలనీ వాసుల కోరిక**



ఫోటో రైటప్-ఫైల్‌నేమ్-సికెపి)-ప్రసంగిస్తున్న కాలనీ వాసులు

చిక్కడపల్లి, మే 31 ప్రభాతవార్త: గత కొన్ని రోజులుగా వివాదాస్పద నిర్ణయంగా మారిన జవహర్‌నగర్ కమ్యునిటీ హాల్‌ను వార్డు కార్యాలయంగా మార్పు ప్రక్రియను జవహర్‌నగర్ కాలనీవాసులు, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఇటు బిఆర్‌ఎస్, అటు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ ప్రత్యేక చొరవ, స్థానికుల ఆందోళనలు, నిరసనలు, పరస్పర ప్రకటనల అనంతరం జిహెచ్‌ఎస్ ఉన్నతాధికారులు ఉపసంహరించుకున్నారు. ఇదే విషయంపై మంగళవారం మధ్యాహ్నం గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్, బిజెపి నగర నాయకుడు ఎ.వినయకుమార్ ఏకంగా జిహెచ్‌ఎంసి కమిషనర్ లోకేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించగా ఆయన నేరుగా జోనల్ కమిషనర్ బండారు శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్‌లోనే ఉపసంరహనణ ఆదేశాలను జారీ చేశారు. దీంతో కార్పొరేటర్ కమిషనర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డివిజన్ ప్రజలకు వారికి ఎటువంటి అన్యాయం జరగకుండా అండగా నిలవడమే తన ముందున్న ప్రధాన కర్తవ్యమని అన్నారు. జవహర్‌నగర్ కమ్యునిటీ హాల్‌లో ఎస్సార్టీ, టిఆర్టీ రెసిడెన్షియల్ అసోసియేషన్ నాయకులు మారిశెట్టి నర్సింగరావు, నర్మెట్ట మల్లేష్, గుండు జగదీశ్, బిఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్, బిజెపి డివిజన్ అధ్యక్షుడు రత్నాసాయిచంద్ మాట్లాడుతూ ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ పావనీ వినయకుమార్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల మరోచోటికి తరలించడం జరిగిందన్నారు. పేదలకు ఉపయోగపడే కమ్యునిటీహాల్ వారికి అసౌకర్య కలిగే చర్యలు, భవిష్యత్తులో కూడా ఎలాంటి కార్యాలయాల ఏర్పాటు చేయరాదని కోరారు. బిఆర్‌ఎస్ నేతలు, అసోసియేషన్ సభ్యులు ఆకుల శ్రీనివాస్, పిఎస్.శ్రీనివాస్, జి.సురేందర్, శ్రీధర్‌రెడ్డి, రవిశంకర్‌గుప్త, సిహెచ్.సాయిలు, పున్న సత్యనారాయణ, మధుకర్, దేవయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భీమ తరహాలో త్వరలోనే 'గీత భీమ' : రాష్ట్ర కల్లు గీత కార్మిక సహకార సంస్థ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్



రవికుమార్‌గౌడ్‌ను జ్ఞాపికను అందజేసి సత్కరిస్తున్న గౌడ సంఘం సభ్యులు

**సైదాబాద్, మే 31 ప్రభాతవార్త:** రైతు భీమ తరహాలో త్వరలోనే 'గీత భీమ'ను అమలు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని తెలంగాణా రాష్ట్ర కల్లు గీత కార్మిక సహకార సంస్థ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ అన్నారు. కల్లు గీత సహకార సంస్థ చైర్మన్‌గా రవి కుమార్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సరూర్‌నగర్ గౌడ స ఘం ఆధ్వర్యంలో సంఘం ప్రధాన కార్యదర్శి కందికంటి శ్రీధర్‌గౌడ్ సభాధ్యక్షతన సరూర్‌నగర్ గౌడ స ఘం భవనంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వైన్స్ దుకాణాల్లో 15 శాతం రిజర్వేషన్‌ను వ్యక్తులకు కాకుండా సొసైటీలకు ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తున్న నీరా కేఫ్‌లను మరింత విస్తృతం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. గీత కార్పొరేషన్ ఆధ్వర్యంలో తాటి, ఈత ఉత్పత్తులను తయారు చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. కల్లు గీత కార్మికుల రక్షణ కోసం సేఫ్టీ కిట్స్‌ను కూడా త్వరలోనే ప్రభుత్వం అందించనుందని ఆయన పేర్కొన్నారు. గౌడ సామాజిక వర్గానికి సేవ చేయాలన్నా ఉద్దేశ్యంతోనే తాను గీత కార్పొరేషన్ చైర్మన్ పదవిని తీసుకోవడం జరిగిందన్నారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. తాటి, ఈత చెట్లపై నుంచి కింద పడి ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కాగా సరూర్‌నగర్ గౌడ సంఘానికి స్థలం కేటాయించాలని, భవన టాక్స్‌ను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సంఘం సభ్యులు రవికుమార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ గౌడ సంఘం అధ్యక్షుడు దయానంద్, ప్రధాన కార్యదర్శి కందికంటి శ్రీధర్‌గౌడ్, సలహాదారులు సత్తయ్య, హయత్‌నగర్ గౌడ సంఘం అధ్యక్షుడు దర్శన్, ఎం.సతీష్‌గౌడ్, పల్లె వినయ్ కుమార్, బిసి జెఎసి చైర్మన్ ఒరుగంటి వెంకటేషం గౌడ్, రామ్మోహన్, మారగోని ప్రవీణ్, బాలరాజు , కాకి గంగాధర్, దూసరి ఆనంద్, కె.ప్రవీణ్, జె.జంగయ్య ఎన్.శ్రీకాంత్, బి.వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి ప్రభుత్వ కుట్రలో భాగమే చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యాలు: చిత్తలూరి వెంకటేశ్వర్లు

**సైదాబాద్, మే 31 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం చేసిన అనుచిత వ్యాఖ్యాలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని విచారణ చేపట్టి స్పీకర్‌ను భర్తరఫ్‌చేసేలా చర్యలు తీసుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు, లింగోజిగూడ డివిజన్ మాజీ కౌన్సిలర్ చిత్తలూరి వెంకటేశ్వర్లు కోరారు. దేశంలోని అత్యున్నత రాజకీయ నాయకుల్లో ఒకరైన చంద్రబాబు నాయుడికి భద్రత తొలగించాలని స్పీకర్ హోదాలో కేంద్ర ప్రభుత్వానికి లెటర్ వ్రాస్తానని తమ్మినేని సీతారాం పేర్కొనడం వైసిపి ప్రభుత్వ కుట్రలో భాగమేనని ఆయన విమర్శించారు. తెలుగు రాష్ట్రాల్లో చంద్రబాబునాయుడికి పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే వైసిపి ప్రభుత్ వం ఇలాంటి చౌకబారు కుట్రలకు తెర తీస్తుందని ఆయన విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు రాబోయే ఎన్నికల్లో అక్కడి ప్రజలు చరమగీతం పాడడం ఖాయమన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : ఉప్పల

**ఎల్.బి.నగర్, మే 31 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరమని రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 60 వేల చెక్కును ఈసీఐఎల్‌కు చెందిన లబ్ధిదారుడు రాజుకు బుధవారం నాగోల్ ఉప్పల క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థిక స్తోమత లేని వారికి ముఖ్యమంత్రి సహాయనిధి తోడుగా ఉంటుందన్నారు. ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్స పొందిన పేద, మధ్య తరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆదుకుంటుందన్నారు.

## రాగన్నగూడలో ఘనంగా పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన



విగ్రహ ప్రతిష్టాపనోత్సవానికి హాజరైన అందెల తదితరులు

**సరూర్‌నగర్, మే 31 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని రాగన్నగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య యంత్ర ప్రతిష్ట చేసి గర్భ గుడిలో పంచముఖ ఆంజనేయ స్వామిని ప్రతిష్టించారు. విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ హాజరై ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. బొద్దమోని రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెవైఎం లీగల్ సెల్ కన్వీనర్ బేరుల భాస్కర్‌రెడ్డి, స్థానిక రాగన్నగూడవాసులు తిరుపతి ఆంజనేయులు ముదిరాజ్, తిరుపతి సంతోష్ ముదిరాజ్, తిరుపతి మహేందర్, మర్రి ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి మనీష్, బొద్దమోని శ్రీకాంత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రతి నెల పారిశుద్ధ్య కార్మికులకు హెల్త్ క్యాంప్ : చైర్‌పర్సన్ అనురాధ

**తుర్కయంజాల్, మే 31 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ పురపాలక సంఘ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు క్రమం తప్పకుండా ప్రతి నెల హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు పురపాలక సంఘం చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కోహెడ వార్డు కార్యాలయంలో స్థానిక కౌన్సిలర్లతో కలిసి ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అనురాధ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు నెలకు ఒకసారి ఆరోగ్య శిబిరాన్ని పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వేసవిలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు, తీసుకునే మందులను, డాక్టర్ రమాదేవి వైద్య బృందంతో కలిసి పారిశుద్ధ్య సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ సాబేర్ అలీ, కౌన్సిలర్లు ధనరాజ్, జ్యోతి జంగయ్య, బాల్‌రాజ్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, జవాన్ నాగేష్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం



స్వామివారి కళ్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**మలక్‌పేట, మే 31 ప్రభాతవార్త :** మలక్‌పేట మున్సిపల్ కాలనీలో నేడు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా చైర్మన్ డాక్టర్ ఉమారెడ్డి ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాల మధ్య అంగరంగ వైభవంగా స్వామివారి కళ్యాణం జరిగింది చుట్టుపక్కల ప్రాంతాల నుండి భక్తులు ముఖ్యంగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో కళ్యాణ మహోత్సవంలో పాల్గొని తమ భక్తుని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జోషి మార్తాండ రావు తో పాటు పోచమ్మ దేవాలయం ట్రస్టీలు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, పిటి శంకర్‌ముదిరాజ్, చేగిరెడ్డి మదన్మోహన్‌రెడ్డి, మాధవరావు, రామకృష్ణ, సురేష్, ప్రభు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## తెలంగాణ దశాబ్ధి ఉత్సవాల్లో రాజకీయాలకు అతీతంగా పాల్గొనాలి



సన్నాహక సమావేశంలో మేయర్ దుర్గ, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, మే 31 ప్రభాతవార్త:** రాజకీయాలకు అతీతంగా తెలంగాణ రాష్ట్ర దశాబ్ధి ఉత్సవాల్లో అందరూ పాల్గొనాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డిలు పిలుపునిచ్చారు. జూన్ 2 నుండి 22వ తేదీ వరకు కార్పొరేషన్‌లో నిర్వహించే తెలంగాణ దశాబ్ధి ఉత్సవాలకు సంబంధించిన సన్నాహక సమావేశం బుధవారం మీర్‌పేట్ కార్పొరేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో కమీషనర్ చిట్టి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మేయర్, డిప్యూటీ మేయర్‌లు మాట్లాడుతూ కార్పొరేషన్ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు అవుతున్నట్లే తెలంగాణ దశాబ్ధి ఉత్సవాల్లో పాలుపంచుకొని విజయవంతం చేయాలని కోరారు. పదేళ్ళలో ప్రజలకు అందిన సంక్షేమ ఫలాలను, అభివృద్ధిని వివరిద్దామని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల లావణ్య బీరప్ప, గజ్జెల రాంచందర్, కొండ్రు గౌరీశంకర్, ఉయ్యాల నవీన్‌గౌడ్, ముత్తంగి కరుణానిధి, కో-ఆప్షన్ సభ్యుడు రజాక్, డిఇఇ గోపినాథ్, ఎఇఇ శ్రీనివాసులు, మేనేజర్ నూకల వెంకట్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## దిల్‌సుక్‌నగర్ షిరిడి సాయిబాబా ఆలయంలో వికలాంగులకు వివాహం

**ఎల్.బి.నగర్, మే 31 ప్రభాతవార్త :** దిల్‌సుక్‌నగర్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో వికలాంగులకు వివాహం జరిపించారు. దేవాలయం ఆవరణలో వికలాంగులకు వివాహం జరిపించి వారిని దేవాలయ కమిటీ సభ్యులు సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసింహగుప్తా, బచ్చు గంగాధర్‌గుప్తా, గుండా మల్లయ్యగుప్తా తదితరులు పాల్గొన్నారు.

## సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ముగిసిన ముఖ్యమంత్రి కప్ క్రీడలు

**ఎల్.బి.నగర్, మే 31 ప్రభాతవార్త :** సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సీఎం కప్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ టోర్నమెంట్ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేన్దర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. క్రీడాకారులు తమ ప్రతిభకు పదును పెట్టి రాష్ట్ర జాతీయస్థాయిలో పథకాలు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన బహుమతులను అందజేశారు.

## బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి కృషి : కరెడ్ల



శ్రీనివాసరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

**మలక్‌పేట, మే 31 ప్రభాతవార్త :** బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, సిఎం కప్ టోర్నమెంట్ నిర్వాహక కమిటీ సభ్యుడు కరెడ్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి సిఎం కప్ బ్యాడ్మింట్ టోర్నమెంట్ పెద్ద ఎత్తున జరుగుతున్న నేపథ్యంలో టోర్నమెంట్ నిర్వాహక కమిటీ సభ్యుడు శ్రీనివాసరావును నగరంలోని ఒక క్రీడా మైదానంలో బిఎటి కోశాధికారి, టిఎస్ సిఎం కప్ చీఫ్ రిఫరీ కె.ఫణిరావు, సభ్యులు పుష్పగుచ్చాలను అందజేసి శాలువాతో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని, క్రీడలతో చక్కటి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు అన్ని విధాలుగా అండగా నిలిచి ప్రోత్సహిస్తామన్నారు. షటిల్ బ్యాడ్మింటన్ క్రీడపై ఆసక్తి ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి శిక్షణ అందించి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## మలక్‌పేటముంతాజ్ కాలేజ్‌లో డిగ్రీ, ఇంటర్మీడియట్ కోర్సులలో డైరెక్ట్ అడ్మిషన్లు

**మలక్‌పేట, మే 31 ప్రభాతవార్త :** హైదరాబాద్ ముంతాజ్ కాలేజ్, మలక్‌పేటలో డైరెక్ట్ అడ్మిషన్లు కొనసాగుతున్నాయని కళాశాల నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలేజీ ఫీజు వాయిదాల పద్ధతిలో చెల్లించుకునే సదుపాయం ఉందని డిగ్రీ విద్యార్థులు సెంట్రల్ స్కాలర్ షిప్ కోసం అప్లై చేసుకోవచ్చున్నారు. ఎమ్మెస్సీ (మైక్రోబయాలజీ), బిబిఎ, బిఎ (మాస్ కమ్యూనికేషన్ మరియు జర్నలిజం), బి.కాం (బిజినెస్ అనలిటిక్స్). బికాం (కంప్యూటర్స్ అండ్ జనరల్), బిఎస్సీ (న్యూట్రిషన్), బిఎస్సీ (మైక్రోబయాలజీ), బిఎస్సీ (బిజెడ్.సి) ప్రవేశ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. వీటితోపాటు ఇంటర్మీడియట్ కోర్సులో సిఇసి, ఎంపిసి, బైపిసిలలో అడ్మిషన్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇంటర్ విద్యార్థులు సెంట్రల్ లేదా స్టేట్ స్కాలర్ షిప్ కోసం అప్లయి చేసుకోవచ్చున్నారు. విద్యార్థులు ఉదయం 10:30నుంచి 5:00 గంటలలోపు నేరుగా కళాశాలలో అడ్మిషన్ పొందవచ్చని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 7842138122ను సంప్రదించవచ్చని సూచించారు.

## స్మశానవాటికను సుందరంగా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



స్మశాన వాటిక పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం, మే 31 ప్రభాతవార్త :** హస్తినపురం డివిజన్ పరిధిలోని భూపేష్ గుప్తానగర్ స్మశానవాటికలో జరుగుతున్న పనులను ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్మశానవాటిక పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. నూతనంగా మూత్రశాలలు నిర్మాణంతోపాటు అంతిమయాత్ర చూడడానికి వచ్చినవారు కూర్చోవడానికి అన్ని వసతులు కల్పించడం జరిగిందని వివరించారు. అదే విధంగా అందమైన పచ్చిక బయళ్లు కూడా నిర్మించడం జరుగుతుందని తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. స్మశాన వాటికలో ఉన్న ముళ్ల పొదలను తీసివేయాలన్నారు. స్మశానవాటికను అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్.బి.నగర్ నియోజకవర్గ భారాస పార్టీ యువజన అధ్యక్షులు ముద్ద కళ్యాణ్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధికి కృషి : కొత్తకాపు అరుణ



సిసి రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ

**సైదాబాద్, మే 31 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని రెవిన్యూబోర్డు కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డును పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ వెంకన్న, కాలనీవాసులు వరప్రసాద్, చందర్‌రావు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## గోపన్‌పల్లిలో విప్రహిత బ్రాహ్మణ భవన ప్రారంభోత్సవానికి తరలిన బ్రాహ్మణులు

**సరూర్‌నగర్, మే 31 ప్రభాతవార్త:** శేరిలింగంపల్లిలోని గోపన్‌పల్లిలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం ద్వారా ప్రతిష్టాత్మకంగా నిర్మించిన విప్రహిత బ్రాహ్మణ భవనం ప్రారంభోత్సవానికి మహేశ్వరం నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున బ్రాహ్మణులు తరలివెళ్ళారు. సిఎం కెసిఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగుతున్న నేపథ్యంలో బుధవారం ఉదయం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ చౌరస్తానుండి మహేశ్వరం నియోజకవర్గ బ్రాహ్మణ సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు మంగు రాఘవరావు ఆధ్వర్యంలో బస్సులు, కార్లలో భారీ సంఖ్యలో బ్రాహ్మణ సంఘాల నాయకులు, బ్రాహ్మణులు, మహిళలు తరలివెళ్ళారు.

## కోతల మాటల సిఎం కేసీఆర్ : శ్రీవాణి




వినూత్న నిరసన తెలియజేస్తున్న శ్రీవాణిఅంజన్‌కుమార్

**ఎల్.బి.నగర్, మే 31 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి కేసీఆర్ మాటల గారడీతో రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ విధానాలను నిరసిస్తూ కార్పొరేటర్ బుధవారం వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తెలంగాణ ప్రజలకు చికెన్, మటన్, ఫిష్, ప్రాన్స్, మిరపకాయ బజ్జీలు, సకినాలు, బాదుషాతో భోజనం పెడతానని చెప్పి తెలంగాణ ప్రజలకు తెల్ల అన్నం గొడ్డుకారం తినిపిస్తున్నాడని ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పథకాలు శాంపిల్ మాత్రమే అన్నారు. దళిత బంధు, డబుల్ బెడ్ రూమ్, నిరుద్యోగ భృతి, దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి, గిరిజనబంధు లాంటి పథకాలన్నీ కేవలం కల్వకుంట్ల కుటుంబ సభ్యుల జేబులు నింపుకోడానికే సరిపోయిందని, తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు.

## దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలు

**తుర్కయంజాల్, మే 31 ప్రభాతవార్త :** ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆపిల్ సిటీ వెంచర్ కాలనీలో శ్రీ ఆంజనేయ స్వామి నూతన ఆలయ నిర్మాణానికి కాలనీవాసులతో కలిసి సత్తయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ చింతనకలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, కాలనీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అభాగ్యులకు అండగా ఉప్పల ఫౌండేషన్



కానుకలు అందజేస్తున్న ఉప్పల స్వప్నశ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, మే 31 ప్రభాతవార్త :** అభాగ్యులకు ఉపల ఫౌండేషన్ అండగా నిలుస్తుందని ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ రాష్ట్ర పర్యాటకశాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన ముగ్గురు వధువులకు బుధవారం ఉప్పల క్యాంపు కార్యాలయంలో పుస్తె, మట్టెలు, గాజులు, దుస్తులను కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు ఆపదలో ఉన్న వారికి ఉప్పల ఫౌండేషన్ చేయూతనందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వధువులు జనగాంకు చెందిన చందన, హన్మకొండ జిల్లాలకు చెందిన మాదుగుల ప్రణీత, నాగోల్ జై పూరి కాలనీకి చెందిన రాణి, వారి తల్లిదండ్రులు, బంధువులు, బీఆర్ఎస్ నాయకులు యాదగిరి, యాదిలాల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : మైనంపల్లి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి తదితరులు

**మల్కాజిగిరి, మే 31 ప్రభాతవార్త :** మౌలాలి కమాన్ వద్ద జరుగుతున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరిశీలించారు. అదే విధంగా స్థానిక ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలు పేర్కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే హన్మంతరావు సంబంధిత అధికారులకు సూచించారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. వివిధశాఖల అధికారులతో అభివృద్ధి పనులకు సంబంధించి తరచుగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, జితేంద్రనాథ్, అమినుద్దీన్, సతీష్ కుమార్, పిట్ల శ్రీనివాస్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు

**ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో...** ఈస్ట్ ఆనంద్‌భాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో రూ. 97 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు డివిజన్ కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జితేంద్ర నాథ్, ఏఈ శ్రీకాంత్, వర్క్ఇన్స్పెక్టర్ రజినికాంత్, నాయకులు సతీష్‌కుమార్, పిట్ల శ్రీనివాస్, బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, సంతోష్ రాందాస్, కిషోర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



చర్లపల్లిలో ఆసుపత్రి ప్రారంభిస్తున్న మంత్రి హరీష్‌రావు

**కుషాయిగూడ, మే 31 ప్రభాతవార్త :** ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు నిరుపేదలైన వారికి ఉచిత వైద్యం అందించినప్పుడే ఆసుపత్రిలో మరింత పేరు గడిస్తాయని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి డివిజన్ శుభోదయం కాలనీలో ఏర్పాటు చేసిన సన్ సీడ్ ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అధిక శాతం గల సాధారణ, మధ్యతరగతి ప్రజలకు వ్యాపార దృక్పథం లేని వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, జేరిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, సాయిజెన్‌శేఖర్, మాజీ కార్పొరేటర్లు పావని మణిపాల్‌రెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, మహేష్‌గౌడ్, డాక్టర్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## మునగనూర్‌లో ఘనంగా వెంకటేశ్వర స్వామి దేవాలయ పునః ప్రారంభ పూజ

**తుర్కయంజాల్, మే 31 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునగనూర్ గ్రామంలో గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ పునః ప్రారంభ పూజ, పునర్నిర్మాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయకమిటీ చైర్మన్ దోమలపల్లి లక్ష్మయ్య, కౌన్సిలర్లు వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి, సంగీతమోహన్‌గుప్తా, కో ఆప్షన్ సువర్ణరాజుగౌడ్, డైరెక్టర్ అంజయ్య, లక్ష్మీదాస్‌గౌడ్, జనార్దన్‌రెడ్డి, సంజీవ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రమేష్‌గౌడ్, కృష్ణాగౌడ్, భాస్కర్‌రెడ్డి, టీంకురెడ్డి, పెంటయ్య, రామ్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు శరీర దారుఢ్యంతో ప్రోత్సాహాన్ని అందిస్తాయి : తలసాని సాయికిరణ్



క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**కుషాయిగూడ, మే 31 ప్రభాతవార్త :** క్రీడలు యువతలో శరీర దారుఢ్యంతో పాటు ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయని బిఆర్‌ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇంఛార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్ పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని ఈసీఐఎల్ గ్రౌండ్లో టిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బిఎల్‌ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్లో విజేతలైన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను సన్మార్గంలో నడపడానికి ప్రోత్సహించడానికి బిఎల్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మారెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ క్రీడా విజేతలకు 50 వేల రూపాయల నగదుతో పాటు షీల్డును అందజేశారు. అదేవిధంగా రన్నర్ కమలానగర్‌జట్లకు 25వేల రూపాయలు బహుమతులు అందించారు. సమాజ సంక్షేమమే లక్ష్యమని బిఎల్‌ఆర్ వ్యవస్థాపకులు బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి బైరి నవీన్‌గౌడ్, సుడిగు మహేందర్‌రెడ్డి, కాసం మహిపాల్‌రెడ్డి,సాయిజన్ శేఖర్, ఇంద్రయ్య, రవీందర్ రావు, బైరి భాస్కర్‌గౌడ్, రహీం, శ్రీకాంత్‌గౌడ్, కాజాపాషా, కాశీనాథ్, గణేష్‌యాదవ్, డప్పు బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎంసిపిఐయు ప్లీనరీని విజయంతం చేయాలి: బొద్రమోని పురుషోత్తం

**సరూర్‌నగర్, మే 31 ప్రభాతవార్త :** జూన్ 4,5,6 తేదీల్లో వరంగల్ జిల్లాలోని నర్సంపేట మండలంలో జరిగే తెలంగాణ రాష్ట్ర ఎంసిపిఐయు ప్లీనరీ సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బొద్రమోని పురుషోత్తం పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం బాలాపూర్ మండలంలోని కుర్మల్‌గూడలోనున్న రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో ప్లీనరీకి సంబంధించిన గోడ పత్రికలు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ప్లీనరీ తలపెట్టారనీ ఈ సభలకు పార్టీ అగ్ర నేతలు హాజరై దిశా నిర్దేశనం చేస్తారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా నుండి అత్యధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐసిటియు రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి రావుల ఝాన్సీ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు బి.సుజాత, అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థిసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి భానుప్రసాద్, సంధ్యారాణి, అరుణ, నాగమణి, స్వరూప, జగదాంబ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.